సాంఘిక కథలు

55

# చందూ - నందూ

"ఒరేయి చందూ... ఆడుకుందాం రారా..!" అంటూ అతని భుజం మీద చేయివేశాడు నందు.

చందూ విదిలించేసుకుని, "ఒరేయ్... నువ్వు నన్ను ముట్టుకోకురా!" అన్నాడు.

"అదేమిట్రా... నేనేం చేశాను?" అన్నాడు నందు.

"నీ చేతికి గజ్జి కురుపులురా. నువ్వు నన్ను ముట్టుకుంటే నాకూ అంటుకుంటాయి" అన్నాడు చందూ అసహ్యంగా.

నందూకి ఎంతో బాధ వేసింది. కళ్ళ నీళ్ళు కూడా వచ్చాయి. వెంటనే ఇంటికి వెళ్లిపోయాడు.

అమ్మని చూడగానే వెక్కివెక్కి ఏడుపు వచ్చింది.

"ఎందుకు బాబూ- ఏడుస్తున్నావు... ఎవరైనా కొట్టారా?" అని ఆప్యాయంగా అమ్మ అడిగింది.

"చందూ చూడవే, 'ఆడుకుందాం రా'... అంటే, 'నీకు గజ్జి కురుపులు ఉన్నాయి, నన్ను ముట్టుకోవద్ద'న్నాడు. కురుపులు నేనేమైనా కావాలని తెచ్చుకున్నానా?" అని ఏడుస్తూ చెప్పాడు నందు.

"మరి- ఆ చందూకి కురుపులు లేవా?" అని అడిగింది అమ్మ.

"లేవమ్మా... వాడి చేతులు శుభ్రంగా వుంటాయి!" అన్నాడు నందు.

"మరి- నేను చెప్పినట్లు చేస్తే నీకూ గజ్జి కురుపులు ఉండవు" అంది అమ్మ.

"ఏం చేయాలి?" అని ఏడుపు మానేసి కళ్ళు పెద్దవి చేసి అడిగాడు నందూ.



"ఏముంది, నువ్వూ శుభ్రంగా ఒళ్ళు బాగా రుద్దుకుని స్నానం చెయ్యాలి. అన్న కాని, ఇంకేదైనా కాని తినేముందు, తిన్న తర్వాత చేతులు బాగా కడుక్కోవాలి. ఆటలు ఆడుకు వచ్చిన తర్వాత స్నానం చేస్తే మంచిది. కనీసం కాళ్ళూ, చేతులూ, ముఖం... అన్నీ బాగా సబ్బు రుద్దుకుని మురికి లేకుండా కడుక్కోవాలి. ఇల్లా చేస్తే నీకూ గజ్జి కురుపులు రావు. ఇన్నాళ్ నేను చెప్పినా నువ్వు చెయ్యకపోవడంవల్ల నీకీ కురుపులు వచ్చాయి" అంది అమ్మ.

"అయితే ఇంక ముందు నువ్వు చెప్పినట్లే చేస్తాను అమ్మా!" అన్నాడు నందూ.

"అయితే నీకీ గజ్జి కురుపులు రావు. అందరూ నువ్వంటే ఇష్టపడుతారు. నిన్నెవ్వరు అసహ్యించుకోరు" అంది అమ్మ.

నందూ ఏడుపు మానేసి ఆడుకోవడానికి వెళ్లిపోయాడు.

★★★